క్లుప్తంగా

వినుకొండ కొండపై త్వరలో నిత్యాన్నదానం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగు పాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం కమిటీ ఆధ్వర్యంలో వినుకొండ కొండపై నిత్య అన్నదాన కార్యక్రమం త్వరలో నిర్వహించేందుకు రామలింగేశ్వరస్వామి దూత కాశినాయన నిత్య అన్నదాన సేవా సంస్థను నెలకొలిపినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అన్నదానానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు కాంతారావు, గుంటూరు అమ్మ ట్రస్ట్ స్వామి బాబా నంద్యాల రామచంద్ర, ఎన్. రామిరెడ్డి, బి.వెంకటరెడ్డి, కూచిపూడి సుబ్బారావు, సీహెచ్. అంజనేయ రెడ్డి, ఎస్.రామిరెడ్డి, బి.రమేష్‌బాబు, ఎన్. గురునాథం, ఎం.రాముడు, బి.కృష్ణారెడ్డి, జి.రాజు, ఎస్.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన బొమ్మిరెడ్డి రాఘవమ్మ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం మొత్తాన్ని ఈఓ టి.సుధాకర రెడ్డికి దాత రాఘవమ్మ అందించారు. తన భర్త వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం విరాళాన్ని అందించినట్లు రాఘవమ్మ తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు. విరాళాలు అందించే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ మాజీ సభ్యుడు వంకా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 31వ తేదీ మహాపౌర్ణమి సందర్భంగా సుప్రసిద్ధ అరుణాచలం స్వామి వారి దర్శనం, గిరిప్రదక్షిణ చేసుకొనుటకు వినుకొండ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఆగస్టు 29వ తేదీ సాయంత్రం 9గంటలకు బయలుదేరి 30వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం 12గంటలకు కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, ఆగస్టు 31వ తేదీ ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం కొరకు చేరుకొని తిరిగి సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 4గంటలకు వినుకొండకు చేరుతుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2,550లుగా నిర్ణయించామని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 7382895527, 7382898320 నంబర్లను సంప్రదించాలన్నారు.

నాలుగు ఎకరాల్లో పశుగ్రాసం దగ్ధం

బొల్లాపల్లి: అగ్నిప్రమాదంలో 4 ఎకరాల పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కర్పూరపు మల్లికార్జునరావు 4 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేస్తున్నాడు. అయితే ఒక్కసారిగా పొలంలో మంటలు చెలరేగి 4 ఎకరాల్లో పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైంది. సమాచారం తెలుసుకున్న వినుకొండ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పోషకాహారంపై అవగాహన సదస్సు

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలలిత ఆదివారం అన్నారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఈనెల 7 వరకు ప్రభుత్వ నిబంధనలు మేరకు తల్లిపాల వారోత్సవాలతో పాటు పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లలో టేక్ హోమ్ రేషన్ విధానం ప్రభుత్వం అమలు చేసిందన్నారు. మండలంలోని 46 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని అందులో గర్భిణులు-206, బాలింతలు-175 మందికి లబ్ధి చేకూరతుందన్నారు. ఒక్కో గర్భిణి, బాలింతకు ప్రతి నెలకు 3 కేజీల రైస్, కందిపప్పు-కేజీ, ఆయిల్-500 గ్రాములు, కోడిగుడ్లు 25, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు మంజూరు చేస్తుందన్నారు. ఇవన్నీ పారదర్శకంగా లబ్ధిదారులకు నేరుగా అందేలా ఆన్‌లైన్ విధానంలో ఫొటో తీసిన తదుపరి నేరుగా పోషకాహారం కిట్లు అందజేస్తామన్నారు.

సేవా నిరతి కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆర్యవైశ్య ప్రతినిధులు

నరసరావుపేట: పట్టణంలోని సీతారామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం రాత్రి 51 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున ఉపకార వేతనాలను పట్టణ ఆర్య వైశ్య సంఘం వారి చేతుల మీదుగా శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పంపిణీ చేశారు. పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పెనుగొండ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సేవా నిరతిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సేవానిరతి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊర భాస్కర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, నాయకులు నిడమూరు సురేంద్ర, ట్రస్టీ అధినేత పెనుగొండ వెంకటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుడు బలవన్మరణం



శివప్రసాద్ (ఫైల్)

నాదెండ్ల: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక రిటైర్డ్ అధ్యాపకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం వెలుగులోకొచ్చింది. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ కళాశాలలో నేలకుదిటి శివప్రసాద్ (61) సివిల్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేసి రిటైరయ్యారు. ఈయన స్వగ్రామం మేడికొండూరు మండలం సిరిపురం గ్రామం. మూడు దశాబ్దాల క్రితం గుంటూరు నుంచి నిత్యం కళాశాలకు ఉద్యోగం నిమిత్తం వస్తుండేవారు. గతేడాది భార్య సుధారాణి గుండెపోటుతో మృతి చెందింది. అప్పటి నుంచి మానసిక కుంగుబాటుకు గురయ్యాడు. తన స్వగ్రామమైన సిరిపురంలో శనివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న నేలబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనకు ఇరువురు కుమార్తెలు. ఇరువురూ ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీరాజ్యం, అధ్యక్షుడు చుండి విజయసారథి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శివప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



షేక్ మౌలాలి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాదెండ్ల: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రీకొడుకులు గాయాలపాలై చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు షేక్ మౌలాలి(71), మస్తాన్ ఈ నెల 2వ తేదీన గణపవరం గ్రామంలో పింఛను తీసుకొని ద్విచక్రవాహనంపై తిరిగి చిలకలూరిపేట వెళ్తున్నారు. జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా మంగళగిరి నుంచి నంద్యాల వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రి మౌలాలి తీవ్రగాయాలపాలు కాగా, కుమారుడు మస్తాన్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అదేరోజు మౌలాలిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు, ఇరువురు కుమార్తెలు కాగా, భార్య గతంలోనే మృతి చెందింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి..

నరసరావుపేట టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. గత నెల 23వ తేదీన శ్రీనిధి హోటల్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న వనటౌన్ పోలీసులు అతన్ని ఏరియా వైద్యశాల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

వస్త్రవ్యాపారి అదృశ్యం

నరసరావుపేట టౌన్: వస్త్రవ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. శ్రీరాంపురంకు చెందిన పాలిశెట్టి పవన్ కుమార్ రైల్వే స్టేషన్‌రోడ్డులో స్టేటస్ రెడీమేడ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిన పవన్ తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటినుంచి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ మేరకు పవన్‌కుమార్ భార్య సాయిభార్గవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమమద్యం కేసులో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు గోనెపూడి గ్రామంలో తనిఖీలు నిర్వహించి అక్కడ అక్రమంగా 20 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న రాజును అరెస్ట్ చేశామన్నా రు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: వ్యక్తి ఆత్మహత్యాయత్నంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. బరంపేట జెండా చెట్టు వీధికి చెందిన సయ్యద్ జానీబాషా తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తూంటాడు. సుమారు మూడు నెలల క్రితం భార్య పుట్టిల్లు అయిన తూబాడు గ్రామానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సంఘటనలో జానీబాషా తల భాగంలో తీవ్రగాయమైంది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయినట్లుగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య హుస్సేన్‌బీ కత్తితో దుప్పటిను కోసి రక్షించింది. జానీబాషా పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో పల్నాడు రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలి



రెంటపాళ్లలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెంటపాళ్ల గ్రామంలోని లూథరన్ దేవాలయంలో ఆదివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వ హించారు. శిబిరాన్ని ప్యారిస్ పాస్టర్ ఎం.వినోద్ మిత్రా ప్రారంభించి, మాట్లాడారు. హెల్ప్ ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాలలో పేదలకు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్యులు డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్ల కలక పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వైద్యులు రాజేష్ మాట్లాడుతూ నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరూ కంటికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సత్తెనపల్లికి చెందిన బాల ఆదిత్య డెంటల్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యులు బాజీబాబు మాట్లాడుతూ దంతాలను సరైన పద్ధతిలో శుభ్రపరచుకోకుంటే పళ్లు, చిగుళ్లకు బ్యాక్టీరియా చేరి హాని కలిగిస్తాయన్నారు. కంటి సమస్యలున్న180 మందిని, దంత సమస్యలున్న 60 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 16 మందికి కంటి శుక్లాలు అవసరమని గుర్తించారు. ఈ శిబిరంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్యారిస్ డెలిగేట్ కట్ట దైవదానం, సభ్యులు మల్లీశ్వరి, అంజలి, సురేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న రవిబాబు

సత్తెనపల్లి: దేశంలో దళితుల మీద జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవి బాబు ఆరోపించారు. కేవీపీఎస్ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం సంఘ నేత చింతపల్లి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన సత్తెనపల్లిలోని పీవీ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రవి బాబు మాట్లాడుతూ చుండూరు దళితుల ఊచకోత దగ్గర నుంచి, నేడు పిడుగురాళ్ల గుత్తికొండలో సజీవ దహనం అయిన దార్ల సాంబశివరావు వరకు చూస్తే పాలకులకు దళితుల ఓట్ల మీద ఉన్న ప్రేమ దళితులకు రక్షణ కల్పించడంలో లేదని ఆయన విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద నాయకత్వంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా దళితుల మీద దాడులు తీవ్రంగా పెరిగాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే దళితుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరిక చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.రాధాకృష్ణ, పల్నాడు జిల్లా నాయకులు ఎం.విల్సన్, మేడం ఆంజనేయులు, ఎం.క్రీస్తు రాజు, బొల్లెపల్లి రామారావు, వంకాయలపాటి పద్మ, సుమ, ఇనుముక్కల ఏసు కుమార్, బంక చిన్న వెంకటస్వామి, కె.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత లోపం వల్లనే సమస్యలు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

సత్తెనపల్లి: పురోహితులు, అర్చకుల్లో ఐక్యత లోపించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బ్రాహ్మణ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. శ్రీ వేద గాయత్రి పురోహిత సంఘం ఆధ్వర్యంలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల సంయుక్త పురోహిత ఆత్మీయ సదస్సు పట్టణంలోని మన్నెం రెసిడెన్సీలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు సంఘ అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పురోహితులు, అర్చకులు సమష్టిగా ఉండాలన్నారు. పురోహితులకు, అర్చకులకు గౌరవం పెరిగేలా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సదస్సులో పలు పురోహిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త మంచి కంటి వెంకటేశ్వరరావును సత్కరించారు. సంఘ నాయకులు వేదాంతం వెంకట హరినాథ్, అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్ శర్మ, రాష్ట్ర నాయకులు కోనంకి మారుతి, సంఘ పూర్వాధ్యక్షుడు సాధువెంకట శివప్రసాద్ శర్మ, మైలవరపు సుబ్బారావు, అన్నవరపు మణికంఠ శర్మ, మోతే పురుషోత్తమ శర్మ, మద్దాలి అనిల్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



నరసరావుపేట: స్థానిక రావిపాడురోడ్డులోని పాలూరి వెంకటరెడ్డికి చెందిన జయవెంకట సత్యసాయి పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలు ఆర్పేయటంతో పెద్దనష్టం తప్పింది. సమీపంలోని పొలాల వారు తమ పొలాల్లోని ఎండు గడ్డికి పెట్టిన నిప్పు కారణంగా పాత గోడౌన్‌లోని సరుకుకు అంటుకొని మంటలు చెలరేగాయి. అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు నేతృత్వంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.

అసిస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు

చిలకలూరిపేటటౌన్: పేద మహిళలను ఆదుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. అసిస్ట్, సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సుభానినగర్‌లో 300 మంది నిరుపేద ఒంటరి మహిళలకు రూ. 6లక్షల విలువైన నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి తమ సంస్థ దోహదపడుతుందన్నారు. సంస్థ సభ్యులు అస్మా, కమాల్, అబ్దుల్లా, జాష్టి కృష్ణహరీష్, మూర్తి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్ర ప్రభుత్వం యువతకు చదువుకు తగ్గ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ ఆదివారం డిమాండ్ చేసింది. దొడ్లేరు గ్రామంలో ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత కలిగిన ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయపోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా దొడ్లేరు గ్రామ డీవైఎఫ్ఐ కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శి మనోజ్‌శాస్త్రి నియమితులైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గోపికుమార్, పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాలకవర్గం



నూతన పాలకవర్గ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలకవర్గం ఎన్నిక ఆదివారం సంఘమంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సురభి జోసఫ్‌కుమార్, కార్యదర్శిగా బేతం గాబ్రియేల్ మోజెస్, కోశాధికారిగా నేలపట్ల శ్యాం వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా కాల్వ సుందర రాజు, వైస్ సెక్రటరీగా పందుల న్యూటన్ ప్రసంగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని సంఘ కాపరి పత్రా ఫిలిప్ ప్రతిష్ట ప్రార్థనలు చేశారు. అనంతరం సంఘ పెద్దలు బేతం శ్యాంప్రసాద్, చాట్ల రామయ్య, గద్దల ఆశీర్వాద ప్రసాద్, వందనం, గద్దల ప్రేమ్‌నాథ్ ప్రకాష్, పందుల ఫిలిప్, పులుగుజ్జు ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేల్ తదితరులు నూతన కమిటీ సభ్యులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రత్యేక పాఠశాలకు ఉపకరణాలు అందజేత



సామగ్రిని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా గుంటూరు బాపూజీ హైస్కూల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (1979-80 బ్యాచ్) ఆధ్వర్యంలో విఠంరాజుపల్లిలోని ఉషోదయ స్కూల్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్స్ పాఠశాలకు రూ.లక్ష విలువైన ఆట వస్తువులు, సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు, రెగ్జిన్ బెడ్స్, ప్లాస్టిక్ ఫీడ్స్, కుట్టు మిషన్, సైకిల్, కలర్ డ్రాయింగ్ బుక్స్, కొన్ని రకాల నోట్‌బుక్స్, గ్లోబు తదితర వస్తువులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులను పాఠశాల సిబ్బంది ఘనంగా నిర్వహించారు. పాఠశాల సిస్టర్ సునీల్ గ్రేస్, డాక్టర్ అబ్దుల్ రజాక్, అసోసియేషన్ సభ్యులు నిదానంపాటి సీతారామాంజనేయులు, బైసాని ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్స్ ఎంఎస్‌కే బాషా, రెడ్డి నాగపద్మ, హెచ్‌ఎం వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

చిలకలూరిపేటటౌన్: ఐక్యపోరాటాలతోనే కార్మిక, ఉద్యోగ, కర్షకుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ నెల 9తేదీ విజయవాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజల్లో ఉన్న అసంతృప్తిని దృష్టి మరల్చటానికి మణిపూర్, హరియాణాలో విద్వేషాలను రెచ్చగొడుతుందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలకు మోదీప్రభుత్వం ప్రయత్నిస్తుందని, యాజమాన్యాలకు మేలు చేసే చట్టాలను తీసుకువచ్చి, కార్మిక సంక్షేమాన్ని గాలికి వదిలివేసిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ మోదీ, సేవ్ ఇండియా నినాదంతో కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల నాయకులు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నాగభైరు సుబ్బాయమ్మ, పేరుబోయిన వెంకటేశ్వర్లు, పేలూరి రామారావు, బొంతా భగత్‌సింగ్, మూసబోయిన వెంకటేశ్వర్లు, నాయుడు శివ, గాత్రం స్టాలిన్, చెంచయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆర్‌ఎంపీలు మెరుగైన వైద్య సేవలందించాలని నరసరావుపేట లైఫ్‌లైన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ పేరం రాజానందరెడ్డి చెప్పారు. నాదెండ్ల మండలం సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆర్‌ఎంపీ వైద్యుల వద్దనే వైద్య సేవలు పొందుతారన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున అందుకు తగిన వైద్యచికిత్స, మందులపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈసందర్భంగా వైద్యులను ఆర్‌ఎంపీలు శాలువాలతో సత్కరించారు. హాస్పటల్ వైద్యులు రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, ఆర్‌ఎంపీ, పీఎంపీల డివిజల్ అధ్యక్షులు షేక్ బాజీ, ఆరేటి నాగేశ్వరరావు, నాదెండ్ల, చిలకలూరిపేట రూరల్ మండలాల అధ్యక్షులు షేక్ నాగూర్‌వలి, ఎస్ రాజు, కార్యదర్శి ఆవుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, రామారావు, ట్రెజరర్ హనుమయ్య ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చిలకలూరిపేటటౌన్: ఓయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గడిచిన 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని నరసరావుపేట మహాత్మగాంధీ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆదివారం పట్టణంలోని కేజే ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్యాన్సర్ మరణాలు అధికంగా ఉన్న సమయంలో ఒయాసిస్ నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం మహిళలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో 80 మంది మహిళలకు ప్యాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, కార్యదర్శి కరణం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.